

రక్తదాన ఉద్యమంలో కలెక్టర్

రక్తదాన ఉద్యమంలో పాల్గొనేందుకు ముందుకు రావాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులు, సిబ్బందికి సూచించారు. - 8లో



వనంగుడిలో చిన్నారులకు ఊయల

చిన్నారులకు పైడితల్లి ఆశీస్సులను అందించేందుకు దేవస్థానం అధికారులు రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి ఆలయ ఆవరణలో ఊయలలను ఏర్పాటు చేశారు. - 8లో

విజయనగరం జేసీగా సేతుమాధవన్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: రాష్ట్రంలో మరోసారి ఐఏఎస్‌లను బదిలీలు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. విజయనగరం జేసీగా పార్వతీపురం ఐటీడీఏ పీఓ సేతుమాధవన్‌ను నియమించింది. ప్రస్తుతం విజయనగరం జేసీగా పనిచేస్తున్న కె.కార్తీక్‌ను ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా జేసీగా బదిలీ అయింది. అలాగే, సీతంపేట ఐటీడీఏ పీఓ రాహుల్‌కుమార్‌రెడ్డికి పశ్చిమగోదావరి జిల్లా జేసీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

న్యూస్‌రీల్

శ్రావణ శోభ



చీరల అలంకరణలో పైడితల్లి

విజయనగరం టౌన్: శ్రావణ మాసం తొలి శుక్రవారం భక్తులతో ఆలయాలు సందడిగా మారాయి. ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లాయి. రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో కొలువైన పైడితల్లిని చీరలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారికి విశిష్ట పూజలు చేశారు. ఆలయ ఆవరణలో సామూహిక కుంకుమార్చనలు జరిపారు. వసంతవిహార్ వసంత గోష్ఠి నిర్వాహకురాలు అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో కాలనీలో మహిళలందరూ కుంకుమార్చనలలో పాల్గొని తాంబూలాలు స్వీకరించారు. మూడు లాంతర్లు వద్దనున్న చదురుగుడిలో అమ్మవారు పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు పర్యవేక్షించారు. మయూరీ కూడలి వద్దనున్న సంతోషిమాత అమ్మవారి దర్శనానికి భక్తులు బారుల తీరారు.

కార్గో సర్వీసులకు అదనపు భవనం

- ప్రారంభించిన జోనల్ ఈడీ రవికుమార్



భవనాన్ని ప్రారంభించిన జోనల్ ఈడీ రవికుమార్

విజయనగరం అర్బన్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్గో పార్సిల్, కొరియర్ విభాగపు సర్వీస్‌ల అదనపు భవనాన్ని విజయనగరం జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) చింతా రవికుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ ప్రయాణికుల కోరిక మేరకు పార్సిల్, కొరియర్ బుకింగ్, డెలివరీ కౌంటర్ సేవలను విస్తరించామని తెలిపారు. 22 శాతం ఆర్థిక వృద్ధితో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో జోన్-1 సేవలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జోనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.వెంకటపతిరాజు, జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణ, జోన్ కమర్షియల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, రీజియన్ మెకానికల్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు, డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, కమర్షియల్ మేనేజర్ దివ్య, సివిల్ ఇంజినీర్ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఇంజినీర్ నాయుడు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా...



హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న సంగీత కళాశాల విద్యార్థులు

విజయనగరం టౌన్: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులతో కలిసి జాతీయ జెండాలతో శుక్రవారం సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించారు. కళాశాల వద్ద ప్రిన్సిపాల్ కేవీఎల్ఎస్.శాస్త్రి జెండా ఊపి ప్రారంభించిన ర్యాలీ గురజాడ గ్రంథాలయం, లయన్స్ క్లబ్, కోట జంక్షన్, గురజాడ స్వగృహం మీదుగా తిరిగి కళాశాలకు చేరుకుంది.

ప్రభుత్వ వైద్యశాల ప్రైవేటు!

విజయనగరంలో గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు టీడీపీ ప్రభుత్వం పూనుకోవడం జిల్లా ప్రజలను ఆందోళన, ఆవేదనకు గురిచేస్తోంది. వైద్యం అందని ద్రాక్షగా మారుతుందని బెంగపడతున్నారు. ప్రభుత్వ పరిధిలో ఉచితంగా అందాల్సిన వైద్యం.. ఇకపై పేదలకు భారంకానుందన్న వార్త గుండెలో అలజడిరేపుతోంది. ప్రభుత్వ తీరును మేధావి వర్గం తప్పుబడుతోంది.





- పీపీపీ అన్నారంటే టీడీపీ ప్రభుత్వంలో ప్రైవేటు ఖాయం!
- విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాలపై కూటమి ప్రభుత్వం కన్నెర్ర
- రూ.500 కోట్ల వ్యయంతో జగన్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు
- వైద్య కళాశాలతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వైద్య సేవలు ఎంతో మెరుగు
- పేదలందరికీ ఉచితంగా శస్త్ర చికిత్సలు
- ప్రైవేటుపరమైతే ప్రజలకు వైద్యసేవలు భారం
- దశాబ్దాల ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజల ఆకాంక్షపై దెబ్బ



జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్మించిన విజయనగరం ప్రభుత్వ మెడికల్ కాలేజీ

సాక్షిప్రతినిధి, విజయనగరం:

ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజల దశాబ్దాల కలను సాకారం చేస్తూ వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విజయనగరంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీని నిర్మించింది. ఇప్పుడు టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి అదే కన్నెర్ర అయ్యింది. దాదాపు రూ.500 కోట్ల ప్రజాధనంతో 70 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో నిర్మించిన కళాశాలను ముందుకు తీసుకెళ్లాల్సిందిపోయి ప్రైవేట్ వ్యక్తుల పరం చేయడానికి కూటమి ప్రభుత్వం శరవేగంగా అడుగులేస్తోంది. గత చంద్రబాబు పాలనలోనే ఉమ్మడి జిల్లాల చెరకు రైతులకు ఆశాదీపంగా ఉన్న లచ్చయ్యపేటలోని ప్రభుత్వ చక్కెర కర్మాగారాన్ని ప్రైవేట్ పరమైన సంగతి తెలిసిందే. తత్ఫలితంగా దాని మనుగడే ప్రశ్నార్థకమైంది. అదే పరిస్థితి విజయనగరం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి వస్తే లక్షలాది మంది ప్రజలకు అందుతున్న నాణ్యమైన వైద్యసేవలను దూరం చేసినట్లే. అంతేకాదు అడిగినంత డబ్బు చెల్లించలేకపోతే ప్రైవేట్ ఆస్పత్రుల్లో డబ్బు దందాలు ఎలా నడుస్తాయో జిల్లా ప్రజలకు అవగతమే. అంతేకాదు ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా జిల్లా సర్వజన ఆస్పత్రిలో సౌకర్యాలు ఎంతో మెరుగయ్యాయి. ఉచితంగా వైద్యసేవలు, శస్త్రచికిత్సలు అందుతున్నాయి. పీపీపీ అంటూ కూటమి ప్రభుత్వంలో ప్రైవేట్ పరమైతే అవన్నీ ప్రజలకు భారమే అవుతాయి. అంతేకాదు కాలేజీలో పేద విద్యార్థులు అడుగుపెట్టే అవకాశాలు క్షీణించిపోతాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మేధావి వర్గం తప్పుబడుతోంది.

జగన్ హయాంలో కళాశాల సాకారం

2019 సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయంతో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం విజయనగరానికి ప్రభుత్వ మెడికల్ కాలేజీని మంజూరుచేసింది. ముఖ్యమంత్రి హోదాలో ఆయనే శంకుస్థాపన చేశారు. గాజులరేగ సమీపంలో 70 ఎకరాల్లో ప్రభుత్వ వైద్య కళాశాలను రూ. 500 కోట్లతో వ్యయంతో అద్భుతంగా నిర్మించారు. గత ఏడాది తరగతులనూ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా వచ్చి ప్రారంభించారు. ఇలాంటి ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుకు శంకుస్థాపన, నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రారంభం ఒకే దఫా పాలనాకాలంలో జరగడం ఒక విశేషం. 150 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. మొదటి ఏడాది వైద్య విద్యార్థులకు తరగతులు విజయవంతంగా జరుగుతున్నాయి. ద్వితీయ సంవత్సర తరగతులు మరో నెల రోజుల్లో ప్రారంభం కానున్నాయి.

ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు...

మెడికల్ కాలేజీకి అనుబంధంగా విజయనగరంలోని జిల్లా ఆస్పత్రి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా మారింది. దీంతో ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు సేవలందిస్తున్నారు. వైద్య సిబ్బంది సంఖ్య పెరిగింది. మౌలిక వసతులు ఎంతో మెరుగయ్యాయి. జిల్లా ఆస్పత్రిగా ఉన్నప్పుడు ల్యాబొరేటరీలో కొన్ని రకాల పరీక్షలు మాత్రమే చేసేవారు. ఇప్పుడు అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఎంఆర్‌ఐ, సిటీస్కాన్, డిజిటల్ ఎక్స్‌రే అందుబాటులోకి వచ్చాయి. ఫోరెన్సిక్ వైద్యనిపుణులు ఉన్నారు. పల్మనాలజీ, న్యూరోఫిజీషియన్, న్యూరో సర్జరీ, పెథాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, నెఫ్రాలజీ వైద్యులు అన్ని వేళలా ప్రజలకు చేరువలో ఉంటున్నారు. ఇదంతా విజయనగరంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటుచేయడం వల్ల కలిగిన సౌలభ్యాలన్న విషయం ప్రజలకు తెలిసిందే. గతంలో ఎన్నడూ లేనివిధంగా సర్వజన ఆస్పత్రిలో ఏడాదికి సగటున 3.70 లక్షల మందికి ఓపీ సేవలు అందిస్తున్నారు. ఇన్‌పేషెంట్లు 45 వేల మంది వరకూ ఉంటున్నారు. మేజర్ ఆపరేషన్లు 5 వేలు, మైనర్ ఆపరేషన్లు 17 వేల వరకు జరుగుతున్నాయి. అల్ట్రాసౌండ్ స్కాన్‌లు 20 వేలు, ఎక్స్‌రేలు 21 వేలు, ల్యాబ్ టెస్టులు 5 లక్షల వరకూ ఉచితంగా అందుతున్నాయి. ప్రసవాలు కూడా 8 వేల వరకు పెరిగాయి.

అప్పడలా..

అత్యవసర వైద్యమైతే విశాఖ నగరానికి వ్యయప్రయాసల కోర్చి పరుగుతీస్తున్న విజయనగరం జిల్లా ప్రజలు స్థానికంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఉండాలని ఎప్పటి నుంచో కోరుకుంటున్నారు. 2019 వరకూ అంతకుముందు వచ్చిన ప్రభుత్వాలేవీ ఆ దిశగా దృష్టి పెట్టలేదు. 2019 సార్వత్రిక ఎన్నికలకు కొద్దిరోజుల ముందు నాటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కాస్త హడావిడి చేశారు. అంతకు కొద్ది నెలల ముందు అప్పటి జిల్లా మంత్రి కిమిడి మృణాళిని టీడీపీ ఎమ్మెల్యేలతో కలిసి స్థల పరిశీలన పేరిట ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ఘోషాస్పత్రిల్లో పర్యటించారు కూడా. ఆ తర్వాత ప్రభుత్వ వైద్య కళాశాల ఊసే ఎత్తలేదు. తర్వాత మాన్సాస్ సంస్థ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తామని అరచేతిలో వైకుంఠం చూపించారు. అందుకు అవసరమైన నిధుల కోసం విలువైన మాన్సాస్ భూములను చౌకగానే అమ్మేశారు. తీరా మెడికల్ కాలేజీ పెట్టే పరిస్థితిలో మాన్సాస్ లేదని ట్రస్ట్ చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు స్వయంగా ప్రభుత్వానికి లేఖ రాసేశారు.

ప్రైవేట్ పరం చేస్తే ప్రజలకు భారమే...

విజయనగరం నుంచి విశాఖపట్నం వెళ్లే ప్రయాణికులకు జొన్నాడ వద్ద పెట్టిన టోల్‌గేట్ వద్ద ఎలా బాదుడేబాదుడు చూపిస్తున్నారో... విజయనగరం ప్రభుత్వ మెడికల్ కాలేజీ టీడీపీ ప్రభుత్వం తలపోస్తున్నట్లుగా ప్రైవేట్‌పరమైతే వైద్యసేవల్లో బాదుడు మొదలవుతుంది. యూజర్ చార్జీల మోత మోగుతుంది.

కూటమి ప్రభుత్వంలో... మహనీయుల విగ్రహాల ధ్వంసం

- అంబేడ్కర్ భావజాలాన్నే తీసేద్దామనే కుట్రలు
- విజయవాడలో అంబేడ్కర్ విగ్రహానికి తీవ్ర అవమానం
- కూటమి ప్రభుత్వ వైఫల్యంపై జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ చిన్న శ్రీను ఆగ్రహం
- ఉమ్మడి విజయనగరం జిల్లాలో నిరసనలు



రాజాం సిటీ: పాలకొండ జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్, తదితరులు



మీడియాతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో మహనీయుల విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారని, చివరకు విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహానికి తీవ్ర అవమానం చేశారని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలుచేస్తూ చివరకు అంబేడ్కర్ భావజాలాన్నీ కనబడకుండా చేద్దామనే కుట్రలు జరగడం దారుణమన్నారు. భోగాపురంలో శుక్రవారం మధ్యాహ్నం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి అనేక దురాగతాలు, హత్యలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు, ఆస్తుల ధ్వంసం చేయడాన్ని ప్రజలంతా గమనిస్తున్నారు. ఈ అరాచకాలను ఎండగడుతూ మా నాయకుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దేశ రాజధాని ఢిల్లీ స్థాయిలో ధర్నా కూడా చేశారు. ఈ కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్య విలువలు పూరిగా దిగజారిపోయాయి. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికే తీవ్ర అవమానం జరిగింది. ఇది రాష్ట్ర చరిత్రలో చీకటిరోజు. అంబేడ్కర్ ఆలోచనలు, నడవడిక, భావజాలం ప్రతీ పౌరుడు స్ఫూర్తిగా తీసుకోవాలనే సదుద్దేశంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విజయవాడ నడిబొడ్డున భారీ విగ్రహాన్ని ఏర్పాటుచేస్తే ఇప్పుడీ కూటమి ప్రభుత్వంలో దుశ్చర్య తలపెట్టారు. అసలు రాష్ట్రంలో బాబాసాహెబ్ అంబేడ్కర్ భావజాలం ఉండకూడదన్న దురుద్దేశంతోనే విధ్వంసానికి తెగించారు. మహనీయుల విగ్రహాలనే తొలగించేయాలనే దుర్బుద్ధితో ఉన్నారంటే వారి ఆలోచనా ధోరణి ఏవిధంగా ఉందో రాష్ట్రంలోని మేధావులంతా ఆలోచించాలి. టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించుకోవాలి. ఇలాంటి దుశ్చర్యలు ఈ దురదృష్టకర సంఘటనలను వైఎస్సార్ సీపీ పూర్తిగా ఖండిస్తోంది. వీటిపై మా పార్టీ పిలుపు మేరకు శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపడతాం. రాష్ట్రంలో అరాచకాలు పునరావృతంగాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉంది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తున్నామని అన్నారు.




అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, నెక్కల నాయుడుబాబు తదితరులు

వెల్లువెత్తిన నిరసనలు...

- రాజ్యాంగ రూపశిల్పి అంబేడ్కర్ న్యాయ మహాశిల్పంపై దాడి చేసిన సంఘ విద్రోహ శక్తులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని విజయనగరం అంబేడ్కర్ రైట్స్ ఫోరమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొంగ భానుమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయనగరం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫోరం సభ్యులతో కలిసి శుక్రవారం ఫిర్యాదు చేశారు.
- వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో నిర్మించారనే అక్కసుతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అంబేడ్కర్ విగ్రహాన్ని కూల్చేయడానికి యత్నించడం మాయనిమచ్చగా మిగిలిపోతుందని బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. బొబ్బిలిలోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.
- విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని టీడీపీ వాళ్లు కూల్చాలని ఆలోచించడం హేయమని వైఎస్సార్‌సీపీ గజపతినగరం మండలాధ్యక్షుడు బూడి వెంకటరావు, జెడ్పీటీసీ గార తవుడు ఖండించారు. గజపతినగరంలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.
- కూటమి ప్రభుత్వం దాష్టీకానికి నిరసనగా రాజాంలోని పాలకొండ కూడలి వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ తలే రాజేష్, నేతలు క్షీరాభిషేకం చేశారు. టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే హత్యలు, అరాచకాలు జరుగుతున్నప్పటికీ ముఖ్యమంత్రిగాని, ఉప ముఖ్యమంత్రిగాని, హోంమంత్రిగాని నోరు మెదపకపోవడం విడ్డూరంగా ఉందని రాజేష్ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజలను పక్కదోవ పట్టించేందుకే ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.
- అంబేడ్కర్ విగ్రహ ధ్వంస చర్యను ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఖండించారు. ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి కొత్తవలస మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.

హేయమైన చర్య



విజయవాడలో గురువారం రాత్రి దుండగులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడిచేయడం హేయమైన చర్య. రాజ్యాంగ నిర్మాత స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాలనే ఆలోచనతో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో ఏర్పాటు చేసిన విగ్రహంపై దాడి చేయడం అమానుషం. దీనిపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషనర్ రాష్ట్రపతి ద్రౌపతిముర్మ తక్షణమే స్పందించి రాష్ట్రంలో శాంతి భద్రతలపై దృష్టిసారించి పాలన సాగించేలా కూటమి ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలి. లేకపోతే రానున్న రోజుల్లో రాష్ట్రంలో ఉన్న దళితులకు మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉంది.

– ములగాడ అప్పలకొండ రాంజీ, జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వెల్ఫేర్ అధ్యక్షుడు, భోగాపురం

విశ్వసించేలా విధుల నిర్వహణ

- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లాలో పనిచేస్తున్న పోలీసులందరూ అంకితభావం, క్రమశిక్షణతో ప్రజలందరూ విశ్వసించేలా విధులు నిర్వహించి పోలీస్ శాఖకు మంచిపేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఎస్పీ వకుల్‌జిందాల్ పిలుపునిచ్చారు. స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన సెరిమోనియల్ పరేడ్‌కు ముఖ్య అతిథిగా హాజరై.. ఆర్మ్‌డ్ రిజర్వు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆర్మ్‌డ్ రిజర్వు అధికారులు, సిబ్బంది, హోంగార్డులతో మమేకమై వారు నిర్వహించే విధులు, బాధ్యతలపై దిశా నిర్దేశం చేశారు. మిగిలిన శాఖల కంటే పోలీస్‌శాఖ ప్రత్యేకమైనదని, పోలీస్ యూనిఫాంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలన్నారు. ప్రతి పోలీస్ ఉద్యోగి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రజలకు ఉత్తమ సేవలందించే పోలీసులపై గౌరవం పెరుగుతుందన్నారు. హోంగార్డ్స్ క్రమశిక్షణతో వ్యవహరించాలన్నారు. ఎవరైనా విధి నిర్వహణలో అలసత్వంగా వ్యవహరించినా, క్రమశిక్షణ ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనంతరం పోలీస్ ఉద్యోగుల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించి పరిష్కార చర్యలు చేపట్టారు. పరేడ్‌లో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎం.ఎం.సోల్మన్, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, రిజర్వు ఇన్స్‌పెక్టర్‌లు ఎన్.గోపాలనాయుడు, ఆర్.రమేష్‌కుమార్, భగవాన్, పలువురు ఆర్ఎస్ఐలు, ఆర్మ్‌డ్ రిజర్వు సిబ్బంది, హోంగార్డ్స్ పాల్గొన్నారు.



సెరిమోనియల్ పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

ఆదివాసీ ఉత్సవంపై చిన్నచూపు

- హాజరుకాని అధికమంది ప్రజాప్రతినిధులు
- భోజనాలు లేక ఆకలితో వెనుదిరిగిన గిరిజన విద్యార్థులు
- విద్యతోనే ఉజ్వల భవిత: మంత్రి శ్రీనివాస్

విజయనగరం అర్బన్: జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం అట్టహాసంగా నిర్వహించిన ఆదివాసీ దినోత్సవానికి అధికమంది ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సాగిన కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించి, పోస్టర్లు వేసినా ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మినహా మిగిలిన ఆరుగురు ఎమ్మెల్యేలు, ఎంపీ హాజరుకాలేదు. ఆ ఒక్క ఎమ్మెల్యే కూడా కార్యక్రమం పూర్తయ్యే వరకు ఉండలేకపోయారు. విలేకరులు ఫొటోలు తీసిన వెంటనే మంత్రి ప్రసంగం పూర్తి కాకుముందే జారుకున్నారు. వీటిని చూసిన గిరిజన నాయకులు మండిపడ్డారు. ప్రజాప్రతినిధులకు తమపై ఉన్న గౌరవాన్ని శంకించారు. ఉత్సవాలు మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగాయి. వివిధ కళా ప్రదర్శనలకు హాజరైన బాలబాలికలు భోజనాలు పెడతారని ఆశపడ్డారు. భోజనాలు పెట్టకపోవడంతో ఆకలితో అలమటించారు. తొలుత రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే పి.అదితి గజపతిరాజు, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జిల్లా అధికారులు అడవితల్లి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం గిరిజన కళాశాలల, పాఠశాల విద్యార్థులు గిరిజన సంప్రదాయ నృత్యాలు, ఆదివాసీ కళాప్రదర్శనలతో అలరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిత సొంతమవుతుందన్నారు. గిరిజనులంతా బాగా చదువుకొని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. సహజవనరుల సంరక్షణకు గిరిజన తెగలు ఎంతగానో పాటుపడుతున్నాయని పేర్కొన్నారు. ఐటీడీఏ సహకారంలో చిన్నచిన్న పరిశ్రమల స్థాపనకు గిరిజనులకు అవకాశం ఉందని, అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. గంట్యాడ మండలం డీకేపర్తి రోడ్డు నిర్మాణానికి, తాటిపూడి రిజర్వాయర్‌లో బోటు షికారుకు కృషిచేస్తామన్నారు. కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని, వాటి పరిరక్షణ కోసం ఏటా ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో జేసీ కె.కార్తీక్, జిల్లా బీసీ సంక్షేమాధికారి కె.సందీప్‌కుమార్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి బి.రామానందం పాల్గొన్నారు. వివిధ గిరిజన సంఘాల నాయకులు డి.శ్యామ్, అప్పలరాజుదొర, ఎ.వెంకటరమణ, లక్ష్మణరావు తదితరులు గిరిజనుల సమస్యలను వివరించి పరిష్కరించాలని మంత్రి, అధికారులను కోరారు. చివరిగా టెన్త్, ఇంటర్, డిగ్రీ తదితర పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన గిరిజన విద్యార్థులను సన్మానించారు.



గిరిజన బాలికల నృత్య ప్రదర్శన



గిరిజన విద్యార్థిని జ్ఞాపికతో సత్కరిస్తున్న మంత్రి కె.శ్రీనివాస్



ఆదివాసీ ఉత్సవానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులందరినీ ఆహ్వానిస్తూ ఏర్పాటుచేసిన పోస్టర్

క్లుప్తంగా

జాబ్ మేళాలో 67 మంది ఎంపిక



ఎంపిక ధ్రువీకరణ పత్రాలతో అభ్యర్థులు

విజయనగరం అర్బన్: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎంఆర్ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 67 మందిని తదుపరి దశకు ఎంపిక చేశారు. సంగీత మొబైల్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, రిలయన్స్ జియో ఫైబర్, క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ్ లిమిటెడ్ కంపెనీల్లో వివిధ కేడర్ ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు మొత్తం 251 మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ పర్యవేక్షణలో జరిగిన ఈ మేళాలో ఎంఆర్‌కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాంబశివరావు, కంపెనీలు హెచ్‌ఆర్‌లు జావీద్, జ్ఞానేశ్వర్, ఎస్.సూరిబాబు, చక్రధర్, యంగ్ ప్రొఫెషనల్ యశ్వంతబాబు, ఉపాధి కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జీవ వైవిధ్య సంరక్షణ పోటీల్లో జిల్లా స్థాయికి ఎంపిక



విజేతలతో ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు

బొబ్బిలి: ఏపీ స్టేట్ బయో డైవర్సిటీ బోర్డు ఆధ్వర్యంలో 'జీవ వైవిధ్య సంరక్షణ–యువత పాత్ర' అన్న అంశంపై బొబ్బిలి డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జరిగిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. స్థానిక ట్రిపుల్‌ఎస్ డిగ్రీ కాలేజ్‌లో శుక్రవారం నిర్వహించిన వక్తృత్వ, షార్ట్‌ఫిలిం తదితర పోటీల్లో బాడంగి, పెంట, రేజేరు, కలువరాయి, కోరపు కొత్తవలస, షికారుగంజి విద్యార్థులు పోటీపడగా వివిధ విభాగాల్లో విజేతలను డిప్యూటీ ఈఓ కె.మోహన రావు అభినందించారు. వారంతా ఈనెల 12న విజయనగరంలోని కస్పా ఉన్నత పాఠశాలలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు హాజరవుతారని నిర్వాహకులు ఎస్ఎస్ఎం రమేష్, ఐఎస్‌వీ ప్రసాద్, కె.సింహాచలం వివరించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఎద్దులు

గంట్యాడ: లారీలో 40 ఎద్దులను అక్రమంగా తరలిస్తుండగా మండలంలోని రామవరం జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. దత్తిరాజేరు మండలం పెదమానపురం పశువులసంత వద్ద కొనుగోలు చేసి వాటిని తుని సంతకు తరలిస్తుండగా గంట్యాడ పోలీసులకు సమాచారం రావడంతో పట్టుకున్నారు. పశువులు కొనుగోలు చేసిన పెదమానాపురానికి చెందిన రాజాన రామారావు, తమిళనాడు రాష్ట్రం దండిగాం మండలానికి చెందిన లారీ డ్రైవర్ వి. అప్పలకృష్ణలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేంద్ర నాయుడు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం

సాలూరు రూరల్: మండలంలోని కురుకుట్టి పంచాయతీ మూల తాడివలసలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్సై వెంకటరమణ శుక్రవారం తెలిపారు. గ్రామ శివారు గంజాయిభద్ర గెడ్డలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు వీఆర్‌ఓకు తెలియజేయగా ఆయన పోలీసులకు సమచారమందజేశారు. దీంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై వెంకటరమణ తెలిపారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

రామభద్రపురం: మండలంలోని రావివలస పంచాయతీ పరిధి చదరడవలస గిరిజన గ్రామానికి చెందిన ఓ బాలిక పురుగు మందు తాగేసిన నేపథ్యంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నీలాద్రి పొట్టన్న దొర కుమార్తె గౌరమ్మ(16) ఇంటి తలుపులు వేయకుండా బయట ఆటుకుంటుంటే తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన గౌరమ్మ ఈ నెల 7వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. గమనించిన తల్లిదండ్రులు ప్రథమ చికిత్స నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై జ్ఞాన ప్రసాద్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹98	₹166	₹176

రక్తదాన ఉద్యమంలో కలెక్టర్

- స్వయంగా రక్తం ఇచ్చి..
- 'మేము' సైతం కార్యక్రమం ప్రారంభం



రక్తదానం చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: రక్తదాన ఉద్యమంలో పాల్గొనేందుకు ముందుకు రావాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులు, సిబ్బందికి సూచించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి 'మేము సైతం' రక్తదాన ఉద్యమం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన రక్తదాన ఉద్యమంలో కలెక్టర్ స్ఫూర్తితో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఉద్యోగులు జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డా.ఎంవీఆర్ కృష్ణాజీ నేతృత్వంలో 65 మంది రక్త దానానికి పేర్లను నమోదు చేసుకుని ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తం డిమాండ్‌ను తీర్చడం, దీర్ఘకాలిక రక్త కొరతను పరిష్కరించడం, రక్తదానం ప్రాముఖ్యం, ప్రాణాలను రక్షించడంలో దాని ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించడం, జిల్లాలో సాధారణ రక్తదాతల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం ప్రధాన లక్ష్యంగా ఈ ఉద్యమాన్ని చేపట్టామని తెలిపారు. అన్ని మండలాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించేలా కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. జిల్లాలో 50 రోజుల వ్యవధిలో మొదటి దశ పూర్తవుతుందని, వారం రోజుల నుంచి పది రోజుల వ్యవధిలో మండలాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నామని చెప్పారు.

రక్తదాత పేరు నమోదుకు వెబ్‌పోర్టల్

జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక మాట్లాడుతూ 'మేము సైతం' కార్యక్రమంలో రక్త దాతగా నమోదు చేసుకోవడానికి వెబ్ పోర్టల్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఒక్కో శిబిరంలో కనీసం 50 యూనిట్ల రక్తం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. మండలంలో రక్తదాన శిబిరాలను సమన్వయం చేసేందుకు మండల స్థాయిలో ఎంపీడీఓలు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.



రక్తదాతలను అభినందిస్తూ ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

మండలాల్లో షెడ్యూల్ ప్రకారం శిబిరాలు

రక్తదాన కార్యక్రమానికి మండల స్థాయి షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 12న గుమ్మలక్ష్మీపురం, 26న కురుపాం, సెప్టెంబర్ 5న పాలకొండ, 15న సీతంపేట, 28 న పాచిపెంట, అక్టోబర్ 2న వీరఘట్టం, 12న జియ్యమ్మవలస, 22న సీతానగరం, నవంబర్ 2న బలిజిపేట, 14న సాలూరు, 26న భామిని, డిసెంబర్ 1న మక్కువ, 10న కొమరాడ, 24వ తేదీన గరుగుబిల్లిలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయనున్నామని జాయింట్ కలెక్టర్ శోభిక న్నారు. ఈ సందర్భంగా రక్తదాతలను అభినందిస్తూ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎస్.సేతు మాధవన్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎంవీ ఆర్.కృష్ణాజీ, డీపీఓ బి.సత్యనారాయణ, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డా.బి. వాగ్దేవి, వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా భూగర్భ జలాల శాఖ అధికారి ఎ.రాజశేఖర రెడ్డి, సామాజిక కార్యకర్త టి.శివ కేశవ రావు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

- ఎస్పీ వకుల్ జిందాల్



పోలీస్ సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్పీ వకుల్ జిందాల్ హామీ ఇచ్చారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి వెల్ఫేర్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన సిబ్బంది చెప్పిన సమస్యలను విన్న ఎస్పీ జిందాల్ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు. వ్యక్తిగత, వృత్తిపరమైన , శాఖాపరమైన సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సంక్షేమానికి ప్రాధాన్యం కల్పిస్తానని చెప్పారు. తనకు వచ్చిన విన్నపాల్లో పోలీస్ సిబ్బంది బదిలీలు, ప్రమోషన్‌లు, ఆరోగ్యపరమైన సమస్యలు, శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు నిలిపివేయాలని కోరుతూ వచ్చినవే ప్రధానంగా ఉన్నట్లు తెలిపారు.

వనంగుడిలో చిన్నారులకు ఊయల



వనంగుడిలో ఊయలలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు చిన్నారులకు ఆశీస్సులను అందించేందుకు గాను దేవస్థానం అధికారులు రైల్వే స్టేషన్ వద్దనున్న వనంగుడి ఆలయ ఆవరణలో ఊయలను శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో వేదపండితుల వేదమంత్రోచ్ఛారణలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊయల్లో ఉంచి పూజాదికాలు చేశారు. అమ్మవారి పాదాల వద్ద తమ బిడ్డలను వేయాలనుకునే వారంతా ఈ ఊయల్లో వేసి, తల్లి ఆశీస్సులు పొందుతారని ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు తెలిపారు. భక్తుల సహాయ, సహకారాలతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామతీర్థంలో శ్రావణమాస శోభ



ఐటీ ప్రొఫెషనల్స్‌కు ఆధ్యాత్మిక సూచనలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధి సహదేవ సకా ప్రభు

- ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు



పుష్పాలంకరణలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున ప్రాతఃకాలార్చన పూజలనంతరం యాగశాలలో సుందరకాండ హవనం, ఆస్థాన మంటపంలో నిత్య కల్యాణ మహోత్సవం వైభవంగా జరిపించారు. అనంతరం ఉపాలయంలో కొలువుదీరిన శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించి, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ వై శ్రీనివాసరావు, అర్చకులు నరసింహాచార్యులు, సాయిరామాచార్యులు, కిరణ్, భక్తులు పాల్గొన్నారు.



రామకోనేరు గట్టుపై హరేకృష్ణ నినాదాలు చేస్తున్న భక్తులు

హరేకృష్ణ భక్తుల సందడి

ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానాన్ని హైదరాబాద్‌కు చెందిన హరేకృష్ణ మూవ్‌మెంట్ సంస్థకు చెందిన భక్తులు శుక్రవారం దర్శించి సందడి చేశారు. ఐటీ, ఇంజినీరింగ్, తదితర రంగాల్లో స్థిరపడిన సుమారు 80 మంది యువకులు ఆలయానికి విచ్చేసి సీతారామస్వామిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో హరేకృష్ణ భజనలు చేపట్టారు. ఈ సందర్భంగా హరేకృష్ణ యూత్ ఎంపవర్ మెంట్ ప్రతినిధి సహదేవ సకా ప్రభు పలు ఆధ్యాత్మికపరమైన సూచనలు అందించారు. యువతలో భక్తిభావాన్ని పెంపొందించడం వల్ల సన్మార్గంలో నడిచేందుకు ఆస్కారం ఉందన్నారు. సనాతన హిందూ సంప్రదాయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూత్ ఎంపవర్‌మెంట్ ప్రతినిధి బందుదాస ప్రభు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

సీతంపేట: మండలంలోని హడ్డుబంగి గ్రామం వద్ద గంటా బెల్లం అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనదారుడు వచ్చి ఢీకొట్టడంతో ఇద్దరూ కిందపడి తీవ్ర గాయాలపాలయ్యారు. గమనించిన స్థానికులు వెంటనే స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. హెచ్‌సీ గురుమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు.

690 కేజీల పీడీఎస్ బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యం సీజ్ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాల అధికారులు

చీపురుపల్లి: మండలంలోని మెట్టపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 690 కేజీల పీడీఎస్ బియ్యాన్ని శ్రీకాకుళం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, చీపురుపల్లి రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడి చేసి శుక్రవారం పట్టుకున్నారు. స్థానికులు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై బి.రామారావు, పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్ పిన్నింటి రామారావులు మెట్టపల్లి గ్రామంలో దాడులు చేపట్టి గ్రామానికి చెందిన సత్యవరపు ఈశ్వరరావు, సత్యవరపు భాస్కరరావులకు చెందిన పాత ఫ్లోర్‌మిల్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 690 కేజీలు బియ్యం పట్టుకున్నారు. అనంతరం పట్టుబడిన బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించి అక్రమంగా పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి నిల్వ ఉంచిన సత్యవరపు ఈశ్వరరావు, భాస్కర రావులపై 6 ఎ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఎస్‌డీటీ రామారావు మాట్లాడుతూ పీడీఎస్ బియ్యం ఎవరు కొనుగోలు చేసినా చట్టరీత్యా శిక్ష తప్పదని హెచ్చరించారు.

గంజాయి అక్రమ రవాణా కేసులో 10మంది అరెస్ట్

- ఎస్పీ వకుల్ జిందాల్



టూటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: గంజాయి అక్రమ రవాణా, వినియోగం కేసులో పదిమంది నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బాబామెట్ట నుంచి డబుల్ కాలనీకి వెళ్లే దారిలో గంజాయి అక్రమంగా కలిగి ఉన్న నలుగురు నిందితులను, గంజాయి వినియోగించిన మరో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. పట్టుబడిన నలుగురు నిందితుల్లో శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసకు చెందిన పటాన్ బాషా అలీ రెండేళ్లుగా బాబామెట్టలో నివాసం ఉంటున్నట్లు, ఒడిశా రాష్ట్రం కించుమండ సంతలోని గుర్తు తెలియని వ్యక్తి వద్ద పదికిలోల గంజాయి కొనుగోలు చేసి, ఇతరులకు విక్రయించే క్రమంలో పోలీసులకు పట్టుబడినట్లు విచారణలో అంగీకరించాడని తెలిపారు. మిగిలిన ముగ్గురు నిందితుల్లో షేక్ కాశీషా, పాత్రో మారయ్యలు విజయనగరం పట్టణానికి చెందినవారని, అలాగే భోగాపురానికి చెందిన తూతిక శ్యామ్ అనే 19ఏళ్ల యువకుడు ఉన్నారన్నారు. వీరు ముగ్గురూ పటాన్‌బాషా అలీ దగ్గర రెండేసి కిలోలు చొప్పున గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. ఈ కేసులో భాగంగా భోగాపురంలో గంజాయి కొనుగోలు చేసి పీలుస్తున్న ఇంజినీరింగ్, డిప్లమో, హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు నలుగురు, టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు వివరించారు.

టీచర్ల సర్దుబాటు మార్గదర్శకాలు మార్చాలి

- ఆపస్ జిల్లా కమిటీ డిమాండ్



వినతిపత్రం అందుకుంటున్న డీఈఓ ప్రేమకుమార్

విజయనగరం అర్బన్: పాఠశాలల్లో ఉపాధ్యాయల సర్దుబాటు ప్రక్రియ కోసం రూపొందించిన మార్గదర్శాలను మార్పు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సభ్యులు శుక్రవారం డీఈఓ ఎన్.ప్రేమకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాల విద్యను నిర్వీర్యం చేసే 117 జీఓ ప్రకారం టీచర్ల సర్దుబాటు చేపట్టడాన్ని నిరసిస్తున్నామని పేర్కొన్నారు. కనీసం ఒక్కసారి కూడా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి చర్చించకుండా ఉపాధ్యాయుల సర్దుబాటు మార్గదర్శకాలు విడుదల చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. 117 జీవో రద్దు చేసి ఉన్నత పాఠశాలల నుంచి మూడు, నాలుగు ఐదు తరగతులను ఉపసంహరించి ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగించాలని కోరారు. పదోన్నతుల తరువాతనే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో 10 మంది కన్నా ఎక్కువ ఉన్న స్కూళ్లకు ఇద్దరు టీచర్లను నియమించాలి. సర్దుబాటు వీలుకాని పాఠశాలల్లో అకడమిక్ విద్యా వలంటీర్లను నియమించాలని సూచించారు. డీఈఓను కలిసిన వారిలో సంఘం ప్రతినిధులు ఇజ్జిరోతు రామునాయుడు, వీవీజే సుబ్రహ్మణ్యం, కె.శివప్రసాదరావు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డుకు రేగులపాడు కేజీబీవీ

- వరుసగా రెండవ ఏడాది బెస్ట్ స్కూల్‌గా ఎంపిక
- హర్షం వ్యక్తం చేసిన కేజీబీవీ సిబ్బంది
- అభినందించిన జిల్లా అధికారులు



స్టేట్‌లో బెస్ట్ పాఠశాలగా రెండవసారి ఎంపికైన రేగులపాడు కేజీబీవీ



యోగాసనాలు వేస్తున్న కేజీబీవీ బాలికలు

వీరఘట్టం: బాలికావిద్యను ప్రోత్సహించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేజీబీవీలు సత్ఫలితాల నిస్తున్నాయి. ఈ క్రమంలో వీరఘట్టం మండలంలోని రేగులపాడు కేజీబీవీని రాష్ట్ర స్థాయిలో ఉత్తమ బాలికా విద్యాలయంగా ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు సీఎం ఆఫీసు అధికారులు రేగులపాడు కేజీబీవీకి ఫోన్ చేసి సమాచారం ఇచ్చినట్లు ఎస్ఓ ఐ.ప్రమీల తెలిపారు. గతేడాది కూడా స్టేట్‌బెస్ట్‌గా ఎంపికైన రేగులపాడు కేజీబీవీకి వరుసగా రెండో ఏడాది కూడా ఉత్తమ విద్యాలయం అవార్డుకు ఎంపిక కావడంతో ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పడిలేచిన కెరటంలా..

గతేడాది అప్పటి విద్యాశాఖ రాష్ట్ర ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ రేగులపాడు కేజీబీవీని సందర్శించారు. ఇక్కడ 8వ తరగతి విద్యార్థులకు గణిత పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడంపై బాధ్యులను చేస్తూ డీఈఓ, జీసీడీఓ, ఎంఈఓ, కేజీబీవీ ఎస్ఓలపై సెస్పెన్షన్ విధించారు. దీంతో రేగులపాడు కేజీబీవీ పేరు రాష్ట్రవ్యాప్తంగా మార్మోగింది. ఈ నేపథ్యంలో ఇక్కడి సిబ్బంది ఉన్నతస్థాయి అధికారుల నుంచి ఎన్నో అవమానాలు, ఛీత్కారాలు ఎదుర్కొన్నారు. అయినా సరే పట్టువీడకుండా బాలికలకు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధిస్తూ గతేడాది పదోతరగతి పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించారు. మొత్తం 33 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా అందరూ ప్రథమస్థానంలో ఉత్తీర్ణులు కావడంతో పాటు వారిలో 21 మంది బాలికలు 500కు పైబడి మార్కులు సాధించారు. ఇలా తమ ప్రతిభతో రాష్ట్రం మొత్తం అభినందించేలా పడిలేచిన కెరటంలా దూసుకువచ్చారు. దీంతో వీరి ప్రతిభను గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న 352 కేజీబీవీలలో రేగులపాడు కేజీబీవీని బెస్ట్‌గా ఎంపిక చేసి వారి శ్రమ, పట్టుదల, కృషికి తగిన గుర్తింపు ఇచ్చింది. మళ్లీ ఈ విద్యా సంవత్సరంలో కూడా ఉత్తమ విద్యాలయంగా ఎంపిక అవ్వడంతో ఇక్కడి సిబ్బంది ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఆగస్టు 15న జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకోనుండడంతో కేజీబీవీ బాలికలు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తమ ఫలితాలతో..రాష్ట్ర స్థాయిలో గుర్తింపు

వీరఘట్టం మండలం రేగులపాడు కేజీబీవీ బాలికలు ప్రతి ఏటా పదో తరగతిలో సాధిస్తున్న ఉత్తమ ఫలితాలే ఈ కేజీబీవీని రాష్ట్ర స్థాయిలో రెండుసార్లు ఉత్తమ కేజీబీవీగా నిలిపాయి. గడిచిన ఐదేళ్లగా పదో తరగతిలో శతశాతం ఫలితాల సాధన, అన్ని కేజీబీవీల కంటే పదో తరగతిలో గరిష్ఠ మార్కులు సాధించడం, ప్రతి తరగతిలో గరిష్ఠంగా బాలికలు చేరడంతో పాటు గరిష్ఠంగా అటెండెన్స్ నమోదు కావడం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని రేగులపాడు కేజీబీవీని వరుసగా ఈ ఏడాది కూడా బెస్ట్ కేజీబీవీగా ఎంపిక చేశారు.

చాలా సంతోషంగా ఉంది

రాష్ట్రంలో ఉన్న 352 కేజీబీవీలలో ఉత్తమంగా రేగులపాడు కేజీబీవీని ప్రభుత్వం గుర్తించడం ఎంతో ఆనందంగా ఉంది.టీచర్ల సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలు నమోదవుతున్నాయి. ఇక్కడ చేరిన బాలికలు క్రమశిక్షణతో విద్య నభ్యసిస్తారు. అందుకే శతశాతం ఫలితాలు సాధించగలుగుతున్నాం. వరుసగా రెండుసార్లు ఉత్తమ అవార్డు రావడంతో మా బాధ్యత మరింత పెరిగింది.



ఐ.ప్రమీల,ఎస్ఓ, కేజీబీవీ, రేగులపాడు